నమస్తే తెలంగాణ
# ఖమ్మం
3 | ఖమ్మం, శనివారం 5 అక్టోబర్ 2024 | KHAMMAM

# నట్టడవిలో నెత్తుటేర్లు..

- ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్
- సుమారు 40 మంది మావోయిస్టులు హతం!
- 36 మృతదేహాలను స్వాధీనపరుచుకున్న బలగాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- మృతులంతా పీఎల్‌జీ 5, 6 కంపెనీల సభ్యులు?
- ఈ ఏడాదిలో 165కి పైగానే ఎన్‌కౌంటర్ మృతులు!



కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 4: దండకారణ్యంలో జరిగిన దండాయాత్రలో రక్తం చిందింది. నట్టడవిలో నెత్తుటేర్లు ప్రవహించాయి. ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, భద్రతాదళాలకు మధ్య శుక్రవారం జరిగిన భీకర పోరులో సాయుధ నక్సలైట్లు పెద్ద సంఖ్యలో ప్రాణాలు విడిచారు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఒక్కసారిగా ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది.

ఛత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెండూర్ – తులతులీ గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సమావేశమయ్యారన్న పక్కా సమాచారంతో స్థానిక పోలీసు బలగాలు, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. దంతేవాడ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని ప్రాంతం కావడంతో ఇరు జిల్లాల పోలీసు బలగాలతోపాటు అర్ధసైనిక బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ఈ క్రమంలో జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులకు దిగారు. వెంటనే జవాన్లు కూడా అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపారు. మూడు గంటల భీకరపోరు తరువాత జవాన్ల తాకిడిని తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలంలో 36 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారికి సంబంధించిన అధునాతన మారణాయుధాలు, ఇతర ఆయుధాలు, వస్తు సామాగ్రిని కూడా జవాన్లు స్వాధీన పరుచుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపులు కొనసాగుతూనే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టులు పీఎల్‌జీఏ 5, 6 కంపెనీలకు చెందిన సభ్యులుగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. 150మందికి పైగానే సాయుధ మావోయిస్టులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. కాగా, 36 మంది మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ 40 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు ప్రాథమిక కథనాలు వస్తున్నాయి. అయితే, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

### భద్రతా బలగాలదే పైచేయిగా..

మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ 'కగార్'ను భద్రతా బలగాలు వేగవంతం చేస్తూ వెళ్తున్నాయి. ఈ క్రమంలో భద్రతా దళాలే పైచేయిగా సాధిస్తున్నాయి. ఈ ఏడాదిలో జరిగిన ఎదురుకాల్పుల్లో 165మందికి పైగానే మావోయిస్టులు మృతిచెందారు. మొన్నటి వరకు జరిగిన భారీ ఎన్‌కౌంటర్లలో మొత్తం 93 మంది మావోయిస్టులు మృతిచెందగా.. అందులో 36 మంది మహిళలు ఉన్నారు. 'ఈ ఘటనలో కీలక నేతలెవరైనా ఉన్నారా?' అనే సందేహాలు నివృత్తి కావాల్సి ఉంది. ఈ క్రమంలో ఈ ఘటన ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. ఈ కాల్పుల్లో ఒక కంపెనీ మొత్తాన్ని భద్రతా దళాలు తుడిచిపెట్టినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఒకవేళ అదే జరిగితే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం లేకపోలేదు. మరికొందరు మావోయిస్టులు బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు తెలుస్తోంది. నిస్సహాయస్థితిలో ఉన్న కొందరు మావోయిస్టులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో ఛత్తీస్‌గఢ్‌తోపాటు తెలంగాణ ప్రభుత్వం సైతం అప్రమత్తమై సరిహద్దుల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించాయి. ఇప్పటికే ప్రత్యేక బలగాలు మావోయిస్టు ప్రభావిత అడవుల్లో గాలింపులు ముమ్మరం చేశాయి. ఎదురుకాల్పుల పూర్తి వివరాలను ఛత్తీస్‌గఢ్ పోలీస్ ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. కాగా, ఎన్‌కౌంటర్ మృతులు, క్షతగాత్రుల్లో తెలుగు రాష్ట్రాల క్యాడరూ ఉన్నట్లు తెలుస్తోంది.



ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





ఖమ్మం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటుచేసిన బతుకమ్మలు



- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న పూలపండుగ వేడుకలు
- మూడోరోజూ ఊరూవాడా మురిసిన ముద్దపప్ప బతుకమ్మ

# తెలంగాణలో పుట్టీ..
# పూలపల్లకి ఎక్కీ..



నెత్తిన బతుకమ్మలతో ఖమ్మం పర్ణశాల వద్దకు..

'తెలంగాణలో పుట్టి.. పూల పల్లకి ఎక్కి.. లోకమంతా తిరిగేవటే..' అంటూ ఉమ్మడి జిల్లా ఆడబిడ్డలందరూ అంగరంగ వైభవంగా బతుకమ్మలు ఆడుతున్నారు. తెలంగాణ పూల పండుగ ఉమ్మడి జిల్లాలో ఘనంగా కొనసాగుతోంది. ఊరూవాడా ఏకమైన ఆడబిడ్డలందరూ శుక్రవారం మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మలతో మురిసిపోయారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అధికారికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముద్దపప్ప బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చారు. పాలు, చక్కెర, పెసలు, సత్తుపిండి, బెల్లం తదితరాలతో నైవేద్యం సమర్పించారు. పెద్ద ఎత్తున ఉద్యోగులు, మహిళలు వేడుకల్లో పాల్గొని గౌరమ్మను పూజించారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఉత్సాహంగా వేడుకలు జరుగుతున్నాయి. మహిళలు, యువతులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో భారీ బతుకమ్మలను ఎత్తుకొని వస్తున్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ బతుకమ్మలను ఆడి సమీప జలాశయాల్లో వాటిని నిమజ్జనం చేస్తున్నారు. –ఖమ్మం, అక్టోబర్ 4





వేంసూరులో బతుకమ్మ వద్ద కోలాట విభాగ మహిళలు, చిన్నారులు



ఖమ్మం తెలంగాణ భవన్‌లో పూజలు చేస్తున్న కమల్‌రాజు



టేకులపల్లిలో బతుకమ్మ ఆడుతున్న ఆడబిడ్డలు



ఖమ్మం ఐడీవోసీ ఎదుట ఏర్పాటుచేసిన బతుకమ్మ వద్ద వైద్య శాఖ అధికారులు



ఖమ్మం బీఆర్ఎస్ ఆఫీసులో..



బతుకమ్మకు హారతి ఇస్తున్న మహిళలు



ఖమ్మంలో కోలాటం వేస్తున్న మహిళలు



ఖమ్మం ఎడ్యుకేషన్: బతుకమ్మ ఆడుతున్న న్యూ ట్రైనీటాట్స్ స్కూల్ విద్యార్థినులు



అశ్వారావుపేట రూరల్‌లో..



బతుకమ్మ ఆడుతున్న గీతాంజలి స్కూల్ ఉపాధ్యాయినులు

# శ్మశానవాటికలో జీవిస్తున్నట్లుగా ఉంది..

- ఖమ్మం కలెక్టర్ ఎదుట కిష్టారం గ్రామస్తుల ఆవేదన
- సింగరేణి ప్రభావిత ప్రాంతంలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన



కిష్టారం సింగరేణి ప్రభావిత బాధితులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 4: సింగరేణి బొగ్గు గనుల కారణంగా వచ్చే దుమ్ము, దద్దరిల్లే బాంబుల మోతతో తాము శ్మశానవాటికలో జీవిస్తున్నట్లు ఉందని కిష్టారం గ్రామస్తులు.. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే రాగమయితో కలిసి సత్తుపల్లి మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాలుష్యం, బాంబు పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లను, వర్షాల కారణంగా కూలిపోయిన నివాసాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో నిర్వాసితులతో సమావేశమయ్యారు. సమావేశం ప్రారంభంలో తమ గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు కలెక్టర్‌కు చెబుతుండగానే విద్యుత్ నిలిచిపోయింది. అనంరతం కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయల కల్పనకు తక్షణమే చర్యలు చేపడతామని హామీఇచ్చారు. గ్రామస్తుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. బ్లాస్టింగ్, వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరుకున్న ఇళ్ల స్థానంలో తిరిగి ఇళ్లు నిర్మించేందుకు సింగరేణి జీఎం షాలెంరాజు చర్యలు తీసుకుంటారని అన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఆయన వద్ద కొన్ని నిధులు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన నిధులు విడుదల చేయించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం డిజిటల్ క్లాస్‌రూంలు, వంట గదులు, సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేయాలని సింగరేణి జీఎంను ఆదేశించారు. కాగా, సింగరేణి ప్రభావిత ప్రాంతంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామస్తులు, రైతులు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. అనంరతం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ.. కిష్టారం గ్రామానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీవో చిన్ననాగేశ్వరరావు, స్నేహ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దయానంద్, సింగరేణి పీవో నరసింహారావు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలందించండి

- అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపించండి
- వైద్యులకు భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశం
- అశ్వారావుపేట సర్కారు దవాఖాన ఆకస్మిక సందర్శన
- వ్యవసాయ కళాశాల ప్రాముఖ్యతపై సమావేశం



సమస్యలపై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అశ్వారావుపేట, అక్టోబర్ 4:రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల కోసం ఓపీ షెడ్ నిర్మించాలని, చెట్ల కింద కూర్చోవడం ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు, ఇతర సమస్యలపై నివేదిక అందించాలని, పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే అందజేస్తే నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి నిధుల కొరత లేదని అన్నారు. 'సమస్యలను నా దృష్టికి తీసుకొస్తేనేగదా పరిష్కారల చర్యలు తీసుకునేది?' అని అన్నారు. రోగుల సమస్యలు తమకు తెలియదనే మాట వైద్యులునీ, సిబ్బంది గానీ చెప్పే పరిస్థితి రాకూడదని అన్నారు. మందుల కొరతను అస్సలు రానీయొద్దని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొందరు రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను కూడా నేరుగా అడిగి తెలుసుకున్నారు. కాగా, మండలంలోని ఇసుక అక్రమ రవాణాను నిరోధించి ర్యాంపుల నుంచి అనుమతులు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు నార్లపాటి శ్రీను కలెక్టర్‌కు విన్నవించారు.

### వ్యవసాయ కళాశాల ప్రాధాన్యతపై సమావేశం

వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధిలో కీలకంగా ఉన్న వ్యవసాయ కళాశాలను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ సందర్శించారు. కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ తోపాటు బోధన సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా సహకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వృత్తిగా కాకుండా సొంత వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పుట్టగొడుగుల పెంపకం, పంటల సాగు, యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. ప్రయోగాత్మక పంటల సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అసోషియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ రాంప్రసాద్, శిరీష, ఝాన్సీ, రెడ్డిప్రియ, శ్రీలత, శ్రావణ్‌కుమార్, కృష్ణతేజ, ఏవో జంబమ్మ పాల్గొన్నారు.

